# 30. పవర్ గేమ్

"మీరెన్ని చెప్తే చెప్పండి గాని నాన్నారూ, అత్తగారు ఉన్న ఏ ఆడదీ సుఖపడినట్టు నేను విన్లేదు. చదవలేదు. తల్లి ఉన్నవాణ్ణి వల్లో వేసుకోవడం నావల్ల కాదు బాబూ!" అని శేషులు అనలేదు కాని ఆమె చూపులోని ఆంతర్యం అదే.

"చూడొసే అమ్మలూ, పెళ్ళికొడుకు తల్లికి అరవై దాటేయి. భగవంతుడి దయ వల్ల అప్పుడే రెండు హార్టు ఎటాక్స్ వచ్చేయి. నువ్వా యింట్లో కాలుపెట్టిన వేళ మంచిదైతే నీకెన్నో రోజులు ఎదురుగాలి ఉండకపోవచ్చు" అని చిదంబరంగారు పైకయితే నచ్చచెప్పలేదు గాని వారి మనసులో మాట మాత్రం ఇదే.

"ఇంకా పెళ్ళయినా కాకుండా కాబోయే అత్తగారి గదిలో అరగంట అలా రెప్పవాల్చకుండా ఉండిపోయిందిట, ఎంతటి కరుణాత్మురాలూ!" అని అందరికీ వినపడేలాగ లోకం బుగ్గలు నొక్కుకుంది కాని, అలా కరిగించేస్తే ఆమె ఒంటి మీద బంగారం ఇప్పటి ధరల ప్రకారం ఎంత కిమ్మత్తు అవుతుందో అని లెక్కలు కడుతూ శేషులు అక్కడే తచ్చాడుతూ ఉండిపోయిందని ఎవరూ ఊహించలేరు కూడా.

ఇంతకీ నిజం చెప్పాలంటే ఆమెను ఆకర్షించింది ఇవాళో, రేపో అని ఎదురుచూస్తున్న అత్తగారి శరీరమూ కాదు. 'ఇంతకంటె ఉన్నవాళ్ళు ఈ ఊళ్ళో ఉన్నారంటావా?' అని సవాలు చేస్తున్న ఆ ఇంటి సిరిసంపదలూ కావు. అసలు ఆ తండ్రినీ, కూతుర్నీ ఆ గదిలో చూసి తల్లిని చూడ్డానికి ఎవరో వచ్చారు కాబోలనుకున్న మాణిక్యం, ఆవిడ భర్త!

అతను మావగారితో అన్నదిదీ :

"ఏమండీ, అమ్మ ఉంటే అన్నీ చూసుకునేది. ఆవిడ ఒళ్ళెరక్కుండా అలా మంచం మీద పడిపోవడం కాదు గాని నా ప్రాణాలు పోతున్నాయి. ఎన్నిసార్లు బోధపర్చినా ఇంకా ఎక్కువ ఇవ్వాలని పాలవాడు చంపేస్తున్నాడు. కొంచెం మీరు లెక్కచూసి, నచ్చచెప్పి పంపేద్దురూ, బాబ్బాబూ, ఇదిగో పద్దు బుక్కు" అలా అన్నప్పుడు పోయిందేదో దొరికినట్టనిపించింది శేషులుకి. తనతో రోజూ స్కూల్‌కి వచ్చే పక్కింటి సూరిబాబు గుర్తుకొచ్చేడు. వాడి ప్రాణానికి ఏడో ఎక్కం రావడం కూడా ఏడుకొండలూ కాలినడకని యెక్కినంత కష్టం. అన్నీ తనచేత చెప్పించుకునేవాడు. వాణ్ణి కూడా తిప్పుకుంటే ఎంతో హాయిగా ఉండేది ప్రాణానికి. అందుకే ఆ పద్దు బుక్కు తండ్రి అందుకుంటూంటే కస్సుమంది.

"చాలు, ఇంట్లో వెలిగిస్తున్నారుగా మీ గొప్పతనం, ఇక్కడ కూడా ఎందుకూ? అయినా ఎప్పటికయినా ఈ ఇల్లు మీది అయే అవకాశం లేదుగా! మీరే పనిమీద వచ్చారో అది ముందు చూసుకోండి" అని ఆ కన్ను అర్థం. చిదంబరంగారు యెడం కన్ను యెగరేశారు.

"అదికాదే, అబ్బాయి ఉత్తి అమాయకుళ్ళా ఉన్నాడే, అది ముందు చూసుకోవేవ్, శేషులోయ్" అని వారి సూచన.

"నువ్వేం సానుభూతి చూపించక్కర్లేదు. మరి నీలా అందరూ గొంతుక దిగని పచ్చి వెలక్కాయలే ఉంటాయా, లోకంలో?" అని మూతి విరుపులో భాష్యం చెప్పి ముందు మాణిక్యం నడుస్తూండగా, వెనక పద్దు బుక్కు పట్టుకొని నడుస్తూ, ఆ క్షణమే అతని సహచారిణి అనిపించుకుంది శేషులు.

అత్తగారింట్లో అడుగు పెట్టినప్పుడు శేషులు ఏ కంపెనీ చెప్పులు వేసుకుందో గాని అంత 'దూరపు ప్రయాణం' ఇట్టే మానుకొని క్షేమంగా యిల్లు చేరేసుకుంది ఆమె అత్తగారు, అవతారం నామధేయురాలు. ఆవిడ కళ్ళల్లో దినదినం వెలిగిపోతున్న ఆరోగ్యం లక్షణాలు చూసి నిలువునా క్రుంగిపోసాగింది కోడలు. "స్వామీ! న్యాయం, ధర్మం అన్నీ తెలిసిన నువ్వే యిలా శీతకన్ను వేస్తే అజ్ఞానులం. మేం ఏమైపోవాలి!" అని మౌనంగా రోదించింది సున్నితమైన ఆమె మనసు. కొత్త కొత్త మందులూ, గొప్ప గొప్ప డాక్టర్లూ ఇలాగే లోకానికి ఎంతెంత అపకారం చేసి పారేస్తున్నారో సామాన్యులు గ్రహించలేరు గదా! అని ఆమెలోని సహజమైన సంస్కరణాభిలాష సంశయం, సంతాపం వెలిబుచ్చింది!

"నువ్వొా ఇలా వచ్చావు, మా అమ్మ యెక్కడ జబ్బు అక్కడ యెగిరిపోయింది!" అన్నాడు మాణిక్యం తను ఎంత తెలివితక్కువ స్టేట్‌మెంట్ ఇస్తున్నాడో గ్రహించలేక.

"మంచం దిగడమే కాకుండా మామూలు పనులు సహా చకచకా మీ అమ్మగారు చేసేసుకుంటూంటే ఇక నేనెందుకూ?"

అని మొగుణ్ణి కవ్వించి చూసింది మాణిక్యం.

"అవును సుమా, ఆలోచించవలసిన విషయమే అనీ, వెళ్ళి మా అమ్మని అడిగి వద్దామా!" అని జవాబు చెప్పిన మొగుణ్ణి చూసి నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు శేషులుకి. కోపం పట్టలేక అనేసింది.

"మీ అమ్మని అడగవలసింది అదికాదు"

"మరేమిటి?" అన్నాడు మాణిక్యం సీరియస్‌గా.

"ఎప్పుడు చాలిస్తావే అమ్మా అనీ!"

"ఏమిటది?"

"ఆవిడ పేరు జోడించి ఆ మాట అడిగి చూడండి, అర్థం అవుతుంది" అనుకుంది మనసులో కసిగా.

"ఎంత పనిచేశారూ నాన్నారూ!" అని మాత్రం ఘొల్లుమంది. కాని నిజంగా ఏడవవలసిన రోజులు ముందున్నాయని ఆ వెర్రి తల్లి యెరగదు.

"ఇద్దరం కలిసి అలా వెళ్ళొద్దామంటే, అలాగే అన్నారుగా, ఏం చీర కట్టుకోమన్నారు?" అని తను అడిగినప్పుడు.

"నువ్వే చీర కట్టుకుంటే బాగుంటుందో నాకెలా తెలుస్తుందీ... నేనేం కట్టుకున్నానా పెట్టేనా?

వెళ్ళి మా అమ్మని అడక్కూడదూ యిట్టే చెబుతుంది" అని మాణిక్యం జవాబు చెబితే ఏం చెయ్యగలిగింది!

"చూడండీ, కొత్తరకం బెడ్‌షీట్స్ తెప్పించాలనుకుంటున్నాను. మనగదిలోకి ఏ రంగైతే బాగుంటుందంటారు!" అని తను ఎంతో ముద్దుగా ప్రశ్నించినప్పుడు.

"మన పెళ్ళికి వచ్చింది చూశావా, బొంబాయి నుంచి మా పెత్తల్లి కూతురు పంకజం దానికి బాగా తెలుస్తాయి యిలాంటివి. రాసి చూడకూడదూ?" అని మాణిక్యం అంటే ఏం తెలుసుకోగలిగింది!

ఆఖరికి,

"ఏమండీ, మనకెందరు పిల్లలుంటే బాగుంటుంది?" పడకగదిలో ప్రశ్నిస్తే దిగ్గునలేచి.

"కనుక్కొని వస్తామండి. కుర్రాళ్ళం మనకేం అనుభవమా, పాడా!" అని వెళ్ళిపోతున్న మాణిక్యాన్ని చూస్తుంటే మంటెత్తుకొచ్చింది శేషులుకి. యెద్దులా ఉన్నారు, ఎన్నేళ్ళొచ్చాయో ఒంటిమీదకి, ఈ రోజుల్లో ఈ మాత్రం ఇంగిత జ్ఞానం లేకపోవడం నమ్మదగ్గ విషయమేనా? లేచి కూచుని చెయ్యి పట్టుకుని భర్తని దగ్గిరగా కూచోపెట్టుకుని నెమ్మదిగా బోధించాలని ప్రయత్నించింది.

"చూడండి. ఇంతటి ఆస్తిపాస్తులకి, ఏకైక వారసులు మీరు. మొగాళ్ళన్నాక ఎవరి పనులు వాళ్ళు చేసుకోవాలని గాని ప్రతిదానికి ఇంకొకరి మీద ఆధారపడితే ఎంత లోకువగా నవ్వులాటగా ఉంటుంది చెప్పండి? పోనీ చిన్నపిల్లలయితే అన్నిటికీ అమ్మకోసం చూసినా అర్థం ఉంది. పెద్దవారు అయారు గదా మీ మటుకు మీరు ఆలోచించుకోలేరూ? సొంత బుద్ధి అన్నది మీకు లేదూ? ఒక్కటడుగుతాను. కోపం తెచ్చుకోక చెప్పండి. ఇప్పుడు ఎన్నేళ్ళు మీకు?"

శేషులు చేతులు వదిలించుకొని చివ్వున లేచిపోయాడు మాణిక్యం.

"అలా నిలుచున్న పాళాన నిలదీస్తే నేనేం చెప్పగలను! మా జాతకాలన్నీ కావిడిపెట్టెలో ఉన్నాయి. తాళం మా అమ్మదగ్గరుంది. ఈ బాధలన్నీ యెందుకూ, ఆమెను అడిగివస్తే పోలేదూ?"

అని శరవేగంతో చప్పుడు చేస్తూ మెట్లు దిగుతున్న మొగుణ్ణి చూసి శేషులు ఏం జవాబు చెప్పుకోగలిగింది!

పెద్దపండుగకని పుట్టింటికి వచ్చిన శేషులుకి మూడునెలలు దాటినా అత్తారింటికి వెళ్ళాలని బుద్ధి పుట్టలేదు. తినక తప్పదు గనుక ఏదో ఇంత తిని అలా వచ్చేపోయే వాళ్ళను చూస్తూ కిటికీ దగ్గర కుర్చీ వేసుకొని కూర్చుంటుంది. ఇంటిపట్టున ఉండడం గాని ఇంకోళ్ళ సంగతి ఆలోచించడం గాని చిదంబరం గారి జాతకంలో లేని విషయాలు. అసలు నాన్నని ఇలా తయారు చేసింది అమ్మకాదూ! అనుకుంది శేషులు. పాపం ఆమెకి గతించిన కన్నతల్లి గురించైనా తలుచుకోడానికి కమ్మని విషయాలు అట్టేలేవు. అయితే తల్లి అధికారదాహం మాత్రం ఆదర్శప్రాయం.

తన చేతిలోంచి ఇంటి పెత్తనం ఎక్కడ జారిపోతుందో అని వెయ్యికళ్ళతో జాగ్రత్త పడేది వాళ్ళమ్మ భాస్కరంగారు. అందరికీ ఒక్కర్తె అయితే ఆమెకి ఇద్దరు అత్తగార్లు. చిదంబరంగారి

కన్నతల్లి ఒక్కర్తీ, పెంపకం తల్లి ఒకర్తీను. వీళ్ళుగాక మరిద్దరు ఆడబడుచుగారలు. వారలు చెప్పుకోవడమేగాని వీళ్ళెవర్నీ కళ్ళతో చూసి ఎరుగదు శేషులు. అంతలా కట్టుదిట్టం చేసి పారేసింది కొంపని. ఆఖరికి ఇంటి విషయాలలో ఎదిగిన సొంత కూతుర్నైనా వేలెట్టనిచ్చేది కాదు. నాలుగు రోజులు ఖర్మం చాలక యెక్కడికైనా వెళ్ళొచ్చినా, ఆ కొద్ది సమయం కూడా తనులేని లోపం ఏ మాత్రం ఎవరూ పసిగట్టకుండా తగిన ఏర్పాట్లుచేసి మరీ ఇల్లు కదిలేది భాస్కరంగారు. ఉన్నట్టుండి చచ్చినంత జబ్బుచేసి కాళ్ళూ చేతులు చల్లబడి ఇంక ఈవిడ ఎన్నాళ్ళో బతకదు అని డాక్టర్లు భాస్కరంగారికి వినబడేటట్టు చెప్పినా ఆమె మనసు దానికి సుతరామూ అంగీకరించలేదు. ఇటు కన్నకూతురికి గాని అటు కట్టుకున్న మొగుడుకి గాని ఏమేనా చెబ్దామని గాని, ఏదైనా అప్పచెబ్దామని గాని ఆమెకి ఆఖరి గడియల్లో కూడా అనిపించలేదు. ఇంట్లో ఆ మాత్రం విలువైన వస్తువులున్న గదుల తాళాలన్నీ పెద్ద గుత్తిగా ఆమె మొలలో ఉండేవి. ఆమె మంచం మీద పడ్డాక మొలలో ఆ గుత్తి ఉందా లేదా అని తెలివి వచ్చినప్పుడల్లా తడుముకొని చూసుకునేది. రోగికి అసౌకర్యంగా గుచ్చుకుంటూ అదక్కడ ఉండకూడదని డాక్టరు చెప్పిన మీదట, చిదంబరంగారు దాన్ని తీసెయ్యబోగా, శక్తినంతటినీ కూడదీసుకొని పెద్ద మూలుగు మూలిగి, కోపమంతా కళ్ళద్వారా వెళ్ళగ్రక్కి ఆ తాళాల గుత్తి కుడిచేతిలో పెట్టేదాకా ఊరుకుంది కాదు. మరి ఏ లోకాలలో తెలియని ఏ చిక్కుదారుల గదులకి అవి తాళపు చెవులు అనుకుందో భాస్కరంగారి ప్రాణం అయితే పోయింది గాని, ఆమె ప్రాణంలో ప్రాణం ఆమె కుడిచేతి గుప్పెట్లో ఉండనే ఉంది. ఆ పట్టు బిగిసింది గాని విడలేదు. ఆ గుప్పెట్లోంచి ఆ గుత్తి విడదియ్యడం కొంచెం కష్టమే అయింది.

ఇదంతా జరిగి రెండేళ్ళ కన్నా యేం ఎక్కువ అవలేదు గాని నిన్నా మొన్నా అయినట్ట నిపిస్తుంది శేషులుకి. అమ్మని తలుచుకోగానే ఆమె కళ్ళకు కట్టినట్టు కనిపించేది ప్రాణం వదిలినా పట్టువదలని ఆమె గుప్పెట మాత్రమే. అధికారం అంతా హస్తగతం చేసుకొని మహారాణిలా నడిచిపోయింది అమ్మ. ఆడది అంటే అలా ఉండాలి అనిపిస్తూ గర్వం కలిగిస్తూ ఉంటుంది అప్పుడప్పుడు ఆ తలంపు శేషులుకి.

తల్లిపోయిన తర్వాత సహజంగా ఆ స్థానం తను ఆక్రమించుకుందామని శేషులు కన్న కలలు కూడా కల్లలే అయాయి. తల్లి ఉన్నన్నాళ్ళూ ఆమె ముందు పిల్లిలా అణిగిమణిగి ఉన్న తన తండ్రి, ఆవిడా కన్నుమూయగానే పులిలా తయారవడం చాలా ఆశ్చర్యం కలిగించింది.

"ఇంకా నలభైయో పడి కూడా వచ్చినట్టు లేదు మీకు. రేప్పొద్దుట, ఉన్న ఒక్క పిల్లా పెళ్ళయి వెళ్ళిపోతే ఇంట్లో దీపం పెట్టేదెవరూ?" అని ఇరుగుపొరుగూ సందేహం వెలిబుచ్చినప్పుడు చిదంబరంగారు ఆ మాటని ఖండించలేదు. పైగా,

"ఇదిగో దీన్ని ముందు పంపించెయ్యాలా మరి?" అని జవాబు చెప్పేవాడు. సంబంధాలు తేవడంలో ఆయన తొందరపాటు చూస్తే, అది తనని ఓ యింటిదాన్ని చెయ్యడంలో ఆత్రుతో లేక ఆ

తరువాత తను మరో యింటివాడు అవాలికదా అనే ఆందోళనో ఒక పట్టాన బోధపడేది కాదు శేషులుకి. పోనీ పుట్టింట్లో పడి ఉన్న ఆ రెండేళ్ళయినా తనని ఇల్లు నడుపనిచ్చిందా? ఊహూ మరో వంటమనిషిని పెట్టేడు, ఇంకో గుమాస్తాని కుదుర్చుకున్నాడు. వాళ్ళందరూ తన కనుసన్నల్లో చెప్పుచేతల్లో ఉంచుకొని అధికారమంతా అరచేతిలో పెట్టుకున్నాడు. అమ్మ వెళ్ళిపోయాక ఏదో వచ్చి ఒళ్ళో పడుతుందనుకున్న శేషులు ఆశ దూరదూరంగా ఒక్కమారు మినుకు మినుకుమనిపించి మరి కనిపించకుండా మాయమైపోయింది.

అటువంటి సందర్భాలలోనే ఆమెకు అస్తమానూ సూరిబాబు జ్ఞాపకం వచ్చేవాడు. ఆఖరికి అతని పెళ్ళి శుభలేఖ తెచ్చినప్పుడు సహా 'శేషులూ, ఇదిగో శుభలేఖ. మీ నాన్నగారి పేరు రాశాను పైన. ఆయన పేరు ముందు శ్రీ అని రాస్తే బాగుంటుందంటావా, లేక మహారాజశ్రీ అని రాయమన్నావా?' అని అడిగిన సంగతి ఎప్పుడూ మరచిపోలేదు. తన అభిప్రాయం అడిగేవాడు లోకంలో సూరిబాబు ఒక్కడేనేమో! చివరికి అతనికి కూడా పెళ్ళయి తన చెయ్యి జారిపోయాడు, అతని పెళ్ళాం ఎంత అదృష్టవంతురాలో!

తన తల్లీ తండ్రీ తనకు ఇవ్వకుండా తొక్కిపెట్టినదేదో కనీసం భర్త ఇంట్లోనైనా లభిస్తుందని ఎన్నో విధాల ఆశించింది శేషులు. ఇక లేదనుకున్న అత్తగారు యిట్టే లేచి కూచుంది. ఒంటిమీద తెలివి అనేది ఉండాలే గాని, బతికున్న ప్రతిక్షణం తన ఉనికి అందరూ గుర్తించేలా సమర్ధవంతంగా నిర్వహించగలదు అవతారం గారు. ఇంటికి ఆనుకొని ఉన్న తోటలోంచి రోజుకి ఎన్ని వంకాయలు కొయ్యాలో, కోసిన ఒక్కొక్క వంకాయ, కూరకోసం ఎన్నేసి ఎలాంటి ముక్కలు తరగాలో కూడా అక్కడ అలా గదిలో కూర్చునే పురమాయించగలదు ఆవిడ.

హోరాహోరీ అత్తగారితో పోరాడి, ఓడిపోయి, మొగుణ్ణి తిట్టి, తనని తిట్టుకుని పుట్టిల్లు చేరుకుంది శేషులు. పండుగ సీజను అవడం చేత కాబోలు, బట్టల వ్యాపారంలో మునిగి తేలుతూ చిదంబరంగారు తన పెళ్ళి వ్యవహారం కొంచెం వెనక్కి పెట్టినట్టున్నాడు. ఈ అదృష్టానికి తోడు సవతితల్లి కూడా దాపురిస్తే తన బతుకు అడగాలా? ఏదో రోజు గడవడం కోసం కిటికీ దగ్గర కూర్చోడం తప్పితే శేషులు చేసేదేముంది?

✪

"అదేమే, టెలిగ్రామ్ ఇచ్చాను, అందలేదూ?" అంటూ తండ్రి ప్రవేశించేదాకా ఆమె ఈ లోకంలోకి రాలేదు. ఊరికెళ్ళినవాడు ఎప్పుడొచ్చాడో! "మాట్లాడవేమే, అత్తగారంటే నీకెంత కిట్టకపోతే మాత్రం నలుగురూ ఏమనుకుంటారో అనైనా ఆలోచించవద్దూ."

"ఏమో ఏం ఇచ్చారో నాకేం అంది చావలేదు. ఇంతకీ ఏం జరిగిందీ?" తండ్రి తన అత్తగారి ఊరు వ్యాపారరీత్యా వెళ్ళిరావడం ఆమె ఎరుగును.

"నేను చెబుతూనే ఉన్నాను, నాలుగు రోజులు ఊరుకోవే, వీధిన పడకే తల్లీ అని, నా మాట

విన్నావా?"

"ఏం జరిగిందంటే?" అంది విసుగ్గా శేషులు.

"అంత బ్లెడ్‌ప్రెషర్ ఉన్న మనిషి ఎన్నాళ్ళు ఉంటుంది! మీ అత్తగార్ని దించేశారు!"

కాస్త కాళ్ళూ, చేతులూ చల్లబడిన ముసిలాళ్ళని దించెయ్యడం, వారు నిమిషాల మీద మళ్ళీ ఇంట్లోకి వేంచెయ్యడం, చాలా చోట్ల వింది శేషులు. అందులో తన అత్తగారా?

"ఏం నమ్మకం కలగడం లేదా ఏమిటి, అలా చూస్తున్నావ్? ఆవిడ కొంచెం మొహమాటం ఉన్న మనిషిలా కనిపిస్తోంది. "దించేశారు, లోపలికి తెచ్చేశారు" ఇలా అస్తమానూ చేస్తే ఏం బాగుంటుందని ఆమెకి అనిపించిందో, పాపం కష్టం సుఖం తెలిసిన తల్లి, ఆవిడగారు ఏకంగా పరమపదించేశారు!

కోడలుగా నువ్వు రావడం, కర్మకాండలో మొగుడితో పాల్గొనడం ఆ మాట అలా ఉంచు. అల్లుడు చూస్తే అమాయకుడు. క్షొప్పట్టినంత ఆస్తి ఎక్కడేముందో తెలీదు. అదృష్టవశాత్తూ నేనైనా ఆ వేళకక్కడ ఉండడం జరిగింది. ఎక్కడెక్కడి బంధువులూ రాబందుల్లా వచ్చి పడిపోతున్నారు. ఇంకా ఏమైనా ఇంగితజ్ఞానం మిగిలివుందేమో, వెంటనే వస్తావేమో అని అర్జెంటు టెలిగ్రాం ఇచ్చాను. అందలేదంటే నేనేం చెయ్యనూ?"

"అయితే నా మాట నమ్మవన్నమాట. అక్కడంత గొడవగా ఉంటే మీరెందుకు వచ్చేసినట్టూ? ఇలా జరిగిందని కాకిచేత కబురంపిస్తే నేవచ్చి పడనూ? ఏమంత దూరమనీ?"

"బాగుంది, నీకే అంత పట్టనప్పుడు నాకేం? ఇక్కడ నేను ఒక్కరోజు లేకపోతే వేలకి వేలు నష్టం. మధ్యని నీకేం?"

"ఆయనగారి పెత్తల్లి కూతురు పంకజం అని ఉంది. మీకు తెలుసుగా, ఆవిడగారు గాని రాలేదు గద?"

"బాగుంది, కబురు అందీఅందగానే బొంబాయి నుంచి సరాసరి ప్లేనులో దిగిందీ అందరికంటె ముందుగా వచ్చి ఇంటికంతటికీ ప్రాతినిధ్యం వహించిదీ ఆవిడేగా?"

ఆ మాట వినీవినగానే అయిదు నిమిషాలు ఆలస్యం చెయ్యలేదు శేషులు. అయిదు నిమిషాలు దాటకుండా రిక్షాలో ఉంది, "కొంచెం తొందరగా తొక్కరా అబ్బీ, నీకు కావలసింది ఇస్తాను" అని హెచ్చరిస్తూ.

తీరా అక్కడికి చేరుకున్నాక గాని, కళ్ళతో చూస్తేగాని తాను కోల్పోయిందేమిటో శేషులుకి అర్థం కాలేదు. ఆ ఊరు చేరి బండిదిగి లోపలికి వెడుతూంటేనే పనిమనిషి అటకాయించింది.

"చినబాబుగారికి రెండ్రోజుల్నుంచీ నిద్రలేదుట, ఇప్పుడే పడుకున్నారట. ఆయన్నెవరూ లేపొద్దని పంకజం అమ్మగారు చెప్పమన్నారు."

శేషులు నిర్ఘాంతపోయింది. పంకజంతో పాటు ఆమెకు దన్నుగా తల్లిని కూడా

తీసుకొచ్చిందా! ఆమె బొంబాయిలో ఉన్నట్టు తను వినలేదే!

"నా మొగుణ్ణి నేను చూడ్డానికి నాకొకరి పర్మిషన్ ఎందుకే, లే!" అని దాన్ని తోసెయ్య బోయింది. ఇలాంటిదేదో జరుగుతుందని ముందే ఊహించింది కాబోలు పంకజం తల్లి గంగమ్మగారు ఆ ఛాయలకు రానే వచ్చింది.

"ఎవరూ, శేషులా! అయ్యో, అయ్యో ఈ ఆరునెలలకి అంత చిక్కిపోయావేమిటే అమ్మాయీ? ఎంత తల్లిలా చూసుకుంటే మాత్రం అత్తగారంటే అంత బెంగపడితే ఎలాగే పిల్లా! చెల్లికి కాలం తీరిపోయింది. వెళ్ళిపోయింది. అంతే. ఇలా ఎటాక్ వచ్చిందని కబురు తెలిసిందో లేదో ఆ నర్సీపట్నం నుంచి వచ్చిపడ్డాను. పాపం సమయానికి మొగదిక్కుగా మీ నాన్నగారు వచ్చి ఎంత చేశారనీ! నీకు టెలిగ్రామ్ ఇప్పించమని కాగితం రాసి నాచేతికిచ్చారు. నిన్న మొన్నటి చిన్నపిల్లవు. ఇలాంటివేమైనా చూశావా, చేశావా? అందులో అత్తగారంటే నీకు ఆరోప్రాణమాయె ఇవన్నీ మొగాయన ఎదుటబడి ఆయనకేం చెప్పనూ! నీతో చెప్పకేం, టెలిగ్రాం ఇప్పించాను కాను. మా పంకజం అయితే ఢక్కామొక్కీలు తిన్నది కనక ఎల్లాగైనా నిగ్రహించుకొస్తుందని ఆ వైరే దాని పేర్న బొంబాయి తిప్పించాను. సరే నిలబెట్టే మాట్లేడుస్తున్నాను. నా మతిమండ... ఎప్పుడనగా బయలుదేరావో... ఇలా రా అమ్మా కష్టాలు మనుషులకి కాకపోతే మానులకి వస్తాయా?"

అని మళ్ళీ మాట్లాడనివ్వకుండా చెయ్యి పట్టుకొని దూరంగా పక్కగా ఓ గదిలోకి లాగి,

"ఇదిగో పంకజం, ఎవరొచ్చారో చూశావా! అలా గుడ్ల నీరు కక్కుకుని నిలబడిపోతావేమే వెర్రిమొహమా! పోయేవాళ్ళతో పోగలమా! మనమాటకేం. రక్తసంబంధం లేని పై వాళ్ళ పిల్ల. కళ్ళల్లో ప్రాణాలూ అదీ ఎలా తయారైందో చూడు. ఇంత హార్లిక్సు కలిపితేవే, మొహం తిరిగి పడిపోగలదూ!"

అంటూ అక్కడే కుదేసింది!

ఇక కర్మ జరిగిన ఆ అన్నిరోజులూ ఏకాంతం మాట దేవుడెరుగు భర్తతో గడపడమే గగనమైపోయింది శేషులుకి. మాణిక్యం మంచినీళ్ళు కావాలని అడిగినా శేషులు ఇవ్వడానికి లేవబోతే "అయ్యో నువ్వక్కడ ఉండే పిల్లని పనిచెయ్యనిస్తున్నావా పంకజం! రేప్పొద్దుట అమ్మాయి కళ్ళు తిరిగి పడిపోతే నిన్నంటారా, నన్నంటారా! బాగుంది వరస.. పట్నంవాసం నీళ్ళు ఒంటబట్టి దీనికి బద్ధకం బలిసింది. మరోలా అనుకోకమ్మా శేషులూ" అని గంగమ్మగారు తగులుకునేది. అక్కడ అలా అయినా ఉండకుండా ఇంకా ఎంతెంత లోతుగల పాతాళలోకాలకి క్రుంగిపోవాలో ఆమెకు అర్థం కాలేదు. ఆ తల్లీకూతుళ్ళని జయించే మార్గమేమిటో గాని ప్రేక్షకురాలిగా చూస్తూ ఎన్నాళ్ళు గడపాలో బుర్రబద్దలు కొట్టుకున్నా ఆమెకు బోధపడి చావలేదు. తిరగబడదామని ఎప్పటికప్పుడు అనుకున్నా ఎందుకోగాని చివరిదాకా వచ్చి ఆగిపోతోంది తను. ఒక్కొక్కప్పుడు అది పిరికితనంగా కనిపించి తనను తాను తిట్టుకుంటుంది. మరొకప్పుడు ఇది సమయం కాదేమో ఇప్పుడు బయట పడకూడదేమో, ఇదంతా తను చేసుకున్న తప్పిదమేమో అని సరిపెట్టుకుంటూ ఉంటుంది. ఏమైనా పంకజం

గంగమ్మగారూ ఎప్పటికప్పుడు తనని నోరెత్తకుండా అతి చాకచక్యంగా నిర్వహించుకు వస్తున్నారు. తనవైపు నుంచే మాట్లాడి తనని పడగొట్టడం వాళ్ళకి బాగా తెలుసు. ఇక తనవైపు తిప్పుకోగలనని యింకా ఆశ పెట్టుకున్న వ్యక్తి తన మొగుడు ఒక్కడే. సమయం చూసి మాణిక్యానికి నచ్చచెప్పాలి. అది వీళ్ళిద్దరూ ఉండగా జరగదేమో! వీళ్ళయినా శాశ్వత బ్రహ్మకల్పంగా ఇక్కడ ఉండిపోరు కద! కర్మకాండ అంతా పూర్తయి దూరపు బంధువులంతా యెవళ్ళిళ్లకు వాళ్ళు చేరుకున్నారు.

శేషులు వెయ్యికళ్ళతో యెదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. మేడమీది గదిలో మాణిక్యం పడుకుని నిద్రపోతున్న తొమ్మిది గంటల రాత్రివేళ అది. తల్లీకూతుళ్ళూ సామాన్లు సర్దేసుకుంటున్నారు. పొద్దుటే ప్రయాణం అంటున్నారు. శేషులు మాటవరసగా అనక తప్పలేదు.

"మీరిద్దరూ వచ్చి యివన్నీ చేయించారు కాబట్టి అన్నీ యధావిధిగా జరిగాయి. లేకపోతే ఇంత ఇంట్లో...."

"ఎంతమాట అమ్మాయీ, మేమేం పైవాళ్ళమా! మా పని మేం చేసుకుపోమూ! వాడా ఓ వెర్రినాగన్న! చెల్లి అంతలా కాలు కిందపెట్టనివ్వకుండా పెంచింది వాణ్ణి. కంట్లో కన్ను పెట్టుకు చూడకపోతే వచ్చిన బంధువులందరూ యెవరికి తోచింది వాళ్ళు మూటగట్టుకుపోరూ!"

శేషులు ముసలిదాని నేర్పరితనానికి విస్తుపోయింది. బంధువులందరూ నలభై దొంగలు. ఈ గంగమ్మగారు ఆలీబాబా. వాళ్ళు తీసుకుపోతుంటే ఊరుకుంటుందా, ఇంకా అందనిది ఏమైనా ఉంటే పోగుచేసుకొని తను మూటకట్టుకుంటుంది గాని!

"అత్తగారు పోయినప్పుడు సమయానికి నేనూ లేను. మీరుండబట్టి ఆయన నిలద్రొక్కుకొచ్చేరు.. మీరూ వెళిపోతే ఒక్కదాన్నీ ఆయన్ని ఎలా పట్టుకోగలనో ఏమిటో."

"దానికి తగ్గ ఏర్పాట్లన్నీ అమ్మ అప్పుడే చేసేసిందిగాక!" అంది పంకజం ఒకటో యెక్కం అప్పచెప్పినంత సులువుగా. "మీ నాన్నగారి కోసం మనిషిని పంపించాము. మూడొంతులు ఈ రాత్రికే రావాలి. ఇంత కష్టం వచ్చింతర్వాత నువ్వు యిక్కడుండకూడదే అమ్మాయీ! ఓ మూణ్ణెల్లయినా పుట్టింటి దగ్గర అన్నీ మరచిపోయి గడుపుతే గాని నువ్వు మళ్ళీ మనిషివికావు.. మా వాడన్నావా, ఈ పరిస్థితుల్లో నువ్వు చెప్పినట్టు వాణ్ణొక్కడ్నీ యిక్కడొదిలేస్తే మరి మనకి దక్కడనుకో... అందుకని బొంబాయి తీసుకెళిపోతుంది పంకజం. నేనొక్కర్తినీ ముసలిముండని ఆ నర్సీపట్నంలో సొంత ఇల్లుంది గదా, అని ఎంతకని పడి ఉండనూ! అద్దెకిచ్చేసి రైలెక్కేస్తాను. తల్లి మీద బెంగ తగ్గి మాణిక్యం మళ్ళీ మనుషుల్లో పడడం అంటూ ఉంటే అక్కడే అన్నీ చూసుకోవచ్చు. డబ్బుంటూ ఉండాలే గాని ఈ ఊళ్ళో పెట్టుకున్న వ్యాపారం బొంబాయిలో పెట్టుకోకూడదని రూలుందా ఏమిటి? ఏమే శేషులూ?"

అప్పటికే పైకి కనపడకుండా కుతకుత ఉడుకుతున్న శేషులు మనసు మీద గంగమ్మగారి ఈ ఒక్కొక్క మాటా ఒక్కొక్క లీటరు పెట్రోలులా పనిచేసింది. చివరి మాట వెలిగించిన అగ్గిపుల్ల. అంతే, ఆ జ్వాలకి అంతులేకపోయింది.

పవర్‌గాని, బ్రెయిన్ గాని ఒకరి సొంతమా? నెవర్!

తల్లిపోయిందని దుఃఖంతో ఒళ్ళెరగకుండా నిద్రపోతున్న మొగుడికి ఒక్కటంటించి లేపి కూచోపెట్టింది శేషులు. ఆ దెబ్బకీ, నమిలి మింగేసేటట్టున్న పెళ్ళాం చూపుకీ మాణిక్యం ఎక్కడి నిద్ర అక్కడ ఎగిరిపోయింది.

"పాతికేళ్ళు నెత్తిమీదకొచ్చేయి. ఆడకూతుళ్ళిద్దరూ ఆస్తంతా దోచుకుపోతూంటే హాయిగా కాలు మీద కాలేసుకొని నిద్రపోతున్నావా, నీకేం సిగ్గూ, బుద్ధీ లేవూ? పింతల్లి చచ్చిందని మనసు బాగులేక కాబోలు నీ అక్క, ఆవిడ పట్టుచీరలు తీసి రోజుకొకటి సింగారిస్తూంటే పోనీ కదా అని ఊరుకున్నాను. నాకు చెందవలసిన అత్తగారి నగలన్నీ రేపో నేడో గుటుక్కుమనవలసిన నీ పెత్తల్లి, చెల్లి పోయిందనే పుట్టెడు దుఃఖంతో అయి ఉంటుంది, మెడ తిరక్కుండా వేసుకు తిరుగుతూంటే కానియ్యి దీని నీచపు బుద్ధి యింతే గదా అని సరిపెట్టుకున్నాను. ఇంటికి చక్రాలు లేవు గాని దానికో మోకుతాడు కట్టి అందులో పాతర సామానూ ఫర్నిచరూ పడేసుకొని దొర్లించుకు పోయేంత శక్తి ఉంది, నీ అప్పకి, దాని తల్లికీను. పోనీ కదా అని ఓర్చేను. వీధిలో నేను పడడమెందుకు, వాళ్ళని పెట్టడమెందుకని భరించాను. నువ్వూ వాళ్ళతో బయల్దేరిపోతావా? ఇప్పుడు కొత్తగా నీకు వచ్చిన కష్టమేమిటని? కనిపెట్టి చూస్తున్నానుగా ఈ వారం రోజులై తిండీనిద్రా రోజురోజుకీ బ్రహ్మాండంగా పెరిగిపోతోంది నీకు. మంచీ చెడ్డా లేకుండా, కట్టుకున్నదానితో మాట మాత్రమైనా అనకుండా, ప్రయాణం పెట్టుకుంటావా! చూస్తాను. ఈ ఇంట్లోంచి నువ్వెలా కాలు కదుపుతావో నేనూ చూస్తాను..."

ఉన్నట్టుండి చెలరేగిన సెగలకీ, పొగలకీ ఉక్కిరిబిక్కిరై ఆ వేళకి ఆ మేడమీది కిటికీ దగ్గర చేరిన తల్లీకూతుళ్ళని గమనించగానే, చూడనట్టు నటిస్తూ ఆ అగ్నిపర్వతం పేట్రేగిపోయింది.

"చూస్తాను.. చూస్తాను... నువ్వే కాదు, వాళ్ళిద్దరూ ఈ కొంపలోంచి అంత సులువుగా ఎలా వెళ్ళిపోగలరో నేనూ చూస్తాను. మా నాన్నకి కబురు పంపిందా మీ పెత్తల్లి? తన వేలితో తన కన్నే పొడుచుకుందనీ ఎరగదా అంత నేర్పరి అయిన మీ అప్ప? ఈ రాత్రికే వస్తాడటగా నాన్న ఇంకేం... ఊళ్ళో పెద్దమనుషుల్ని కేకేయిస్తాను. ఆ తల్లీకూతుళ్ళ గదికి నవతాళ్ వేయిస్తాను. అందులో వాళ్ళ సామానులు ఎన్నో పంచాయితీ పెట్టిస్తాను... ఈ ఊర్నించి నా మొగుణ్నీ, ఇంత వ్యాపారాన్నీ కూడా నడిపించేస్తారేం! నా మొగుడి దగ్గరకి నేను, ఏ చుట్టపుచూపుగానో, ఏ మూణ్ణెళ్ళ తరువాతో వెళ్ళాలా! ఎంత దయ నా మీద! ఇవన్నీ చూస్తూ భరించడానికి అంత గుడ్డి పీనుగునేం నేను? నేనంటే ఎవరనుకున్నారు? భాస్కరం కూతుర్ని, అవతారం కోడల్ని... చూస్తాను.. చూసి తీర్తాను... ఈ తల్లీకూతుళ్ళు క్షేమంగా ఈ గడప ఎలా దాటతారో చూస్తాగా..."

శేషులుకి అంత శ్రమ అక్కర్లేదు. ఆసరికే చేజిక్కిన సామాన్లతో చేత్తో పట్టుకున్న ప్రాణాలతో వాళ్ళిద్దరూ రైల్లో ఉన్నారు.

ఆరునెలలు గడిచింది. ఆసరికి ఇళ్ళూ, పొలాలూ, వ్యాపారం అన్నీ శేషులు తన పేర

రాయించేసుకోవడం జరిగింది. ఇక్కడి వాళ్ళని మాన్పించేసి నౌఖర్నీ, గుమాస్తానీ, వంటమనిషినీ తన పుట్టింటి నుంచి పిలిపించి ఇక్కడ పనులు ఇవ్వడం జరిగింది. ఆరోజు మధ్యాహ్నం నిశ్చింతగా నిద్రపోతున్న మొగుణ్ణి చూస్తూంటే శేషులు మనసులో యేవేవో తలంపులు ముసురుకోజొచ్చేయి.

"మాయదారి ఆడాళ్ళు! మొగాళ్ళని మొగాళ్ళలా బతకనియ్యరు గదా! వాళ్ళకీ వ్యక్తిత్వం అనేది ఉంటుందనీ వాళ్ళమటుకు వాళ్ళని వదిలేసి స్వేచ్ఛగా, హాయిగా బతకనియ్యరు గదా! అరికాలు కింద సందులో అణిచిపెడదామని వెర్రి ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. నా మొగుణ్ణి వీళ్ళంతా అధికారం కింద తొక్కిపెడదామని ఒకప్పుడు ప్రయత్నించిన వాళ్లే కదా! ఈయన్నిలా ఆయన ఊపిరి ఆయన పీల్చుకునేలా చెయ్యడానికి నేను ఎంత తంటాలు పడవలసి వచ్చిందో!" అరగంట కొట్టి ఆమె ఆలోచనలు చెదరగొట్టింది. ఒక్క కుదుపు కుదిపి మొగుణ్ణి లేపి కూచోబెట్టింది.

"ఏమండోయ్! ఇక అదేపనిగా నిద్రపోతూ కూచుంటే వ్యాపారమంతా యెవరు వెలిగిస్తారనుకున్నారు! ఇవ్వాళ అనపర్తి వాళ్ళు సరుకు తెస్తానన్నారు గుర్తుందా? అయిదువేలకి ఒక్క పైసా ఎక్కువైతే ఒప్పుకోకండి. తెలిసిందా? మళ్ళీ గదిలోకి వెడతారెందుకు? ఈ బట్టలు బాగానే ఉన్నాయి. పదండి. ఏమిటీ, కాఫీ కావాలా? వచ్చాక తాగొచ్చులెండి. ముందు మేడ దిగండి. నేను చెప్పిందంతా గుర్తుందిగా?" ఆవిధంగా ఆ భార్య, తత్‌భర్తకి కుడిచేతి చూపుడు వేలు క్రింది వైపుగా చూపించింది. మున్ముందు చూస్తుంది కూడా, అవకాశమంటూ దొరకబుచ్చుకోవాలే గాని ఆడది అధికారాన్ని 'హస్తగతం' చేసుకోనిదెప్పుడు!

★